క్లుప్తంగా

నేడు సంగీత విభావరి

నెహ్రూనగర్: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ప్రకాష్ మ్యూజికల్స్ ఆధ్వర్యంలో శనివారం సంగీత విభావరి నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కె.రాజేంద్ర కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైవ్ ప్రొగామ్ ద్వారా గీతాలాపాన జరుగుతుందని చెప్పారు.

సనాతన ధర్మం జీవన విధానం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై శుక్రవారం సనాతన ధర్మం– జీవన మార్గంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంస్కృత భారతి సభ్యులు ఉపద్రష్ట లక్ష్మణసూరి మాట్లాడారు. సనాతన ధర్మం మతం కాదని జీవన విధానమని అన్నారు. ప్రకృతిని ఆరాధించే సంస్కృతి మన సంప్రదాయమని పేర్కొన్నారు.

శాకంబరీ దేవీగా కనకదుర్గమ్మ అమ్మవారు



నగరంపాలెం: స్థానిక సంగడిగుంటలోని శ్రీకనకదుర్గ అమ్మవారి గుడి ఆవరణలో అమ్మవారు శుక్రవారం శాకంబరీదేవీగా అలకరించారు. అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను ఆలయ నిర్వాహకులు అందించారు. కనకదుర్గ ఆలయ కమిటీ అధ్యక్షులు మారెడ్డి శ్రీనివాసరెడ్డి(రూప), కార్యదర్శి మూరబోయిన నరసింహారావు, ఉపాధ్యక్షులు మద్దిరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఆరవ ఆంజినేయులు, కోశాధికారి కల్లి శ్రీనివాసరెడ్డి, సభ్యులు పత్రి అప్పారావు, అరవపల్లి సాంబశివరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

యువతి అనుమానాస్పద మృతి

లక్ష్మీపురం: భార్యాభర్తల మధ్య చిన్నపాటి వాగ్వివాదంతో భార్య ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. శ్రీనగర్ ప్రాంతానికి చెందిన ప్రత్తిపాటి ప్రవల్లిక(23) భర్త కంతేటి పవన్ కళ్యాణ్ 8 నెలల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యాభర్త ఓ రియల్ ఎస్టేట్ సంస్థలో పనిచేస్తున్నారు. సెల్‌ఫోన్ విషయంలో చిన్నపాటి వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో గురువారం అర్ధరాత్రి నిద్రపోతున్న గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. దీన్ని గమనించిన భర్త ప్రభుత్వ సమగ్రాసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. దీంతో సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలంలో ఆత్మహత్య చేసుకున్న వైనాన్ని పరిశీలించి మృతురాలు ప్రవల్లిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలి

పెదకాకాని: అభివృద్ధి పనులకు అందరూ సహకరించాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత 9 నెలల కిందట మండలంలో అభివృద్ధి పనులకు సుమారు రూ.1.50 కోట్లు మండల పరిషత్ నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులకు ఎక్కడ.. ఏ పనులు చేపట్టారు.. పూర్తి అయ్యాయా.. ఎన్ని పనులు పూర్తి చేశారు అనే ప్రశ్నకు సమాధానం లేదన్నారు. అనంతరం అధికారులు శాఖల వారీగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు.

సగం మంది గైర్హాజరు..

సమావేశానికి సగానికి పైగా ప్రజా ప్రతినిధులు, అధికారులు గైర్హాజరయ్యారు. శాఖల వారీగా సమాధానం చెప్పాల్సిన అధికారులు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో సమావేశం సాదాసీదాగా ముగించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కామినేని శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ సమావేశం

చేబ్రోలు: పొన్నూరు నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని చేబ్రోలు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు.. పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ సూచనల మేరకు.. బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

వణికిస్తున్న బోన్ క్యాన్సర్

- యుక్త వయస్సులో బీ కేర్‌ఫుల్
- ప్రాథమిక దశలో గుర్తిస్తే నయం చేయవచ్చు
- జూలై బోన్ క్యాన్సర్ అవగాహన నెల



గుంటూరు మెడికల్: 'పల్నాడు జిల్లా రాజుపాలేనికి చెందిన బాలుడు స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆటలు ఆడుకుంటూ కింద పడగా కాలికి దెబ్బతగిలింది. కొద్దిరోజులు పాటు ఇంట్లో చెప్పలేదు. కాలినొప్పి ఎక్కువ కావటంతో తల్లిదండ్రులకు చెప్పాడు. వారు కూడా ఆటల వలన గాయం నొప్పి, వాపు వచ్చాయని భావించి ఆస్పత్రికి వెళ్లకుండా నొప్పి నివారణ కోసం ఇంట్లో సొంత వైద్యం చేశారు. నొప్పి తీవ్రత పెరగడంతో గుంటూరు వైద్యులను సంప్రదించారు. ఆర్థోపెడిక్ వైద్యులు పరీక్షలు చేసి బోన్ క్యాన్సర్‌గా నిర్ధారించారు. జూలై బోన్ క్యాన్సర్ అవగాహన మాసం.

వ్యాధి లక్షణాలు....

బోన్ క్యాన్సర్ సోకిన వారిలో నొప్పి, వాపు ఉంటుంది. నొప్పి వలన సరిగ్గా నిద్రపట్టదు. ఆకస్మికంగా బరువు తగ్గుతారు. ఉన్నట్టుండి కిలోల కొద్దీ బరువును కోల్పోతారు. పీలగా మారిపోతారు. తీవ్రమైన అలసటకు గురవుతారు. కొందరు ఉన్నట్టుండి సడెన్‌గా కుంటుతూ నడుస్తారు. రాత్రి సమయంలో విపరీతంగా చెమట పడుతుంది. చెమటలతో శరీరం మొత్తం తడిసిపోతుంది. తరుచూ జ్వరం వస్తుంది. నెలలో రెండు లేదా మూడుసార్లు జ్వరం వస్తుంది. ఎముకపై గడ్డ ఏర్పడుతుంది. ఎముక బలహీనంగా మారి పగుళ్లు వస్తాయి. పెద్దవారిలో బ్యాక్ పెయిన్ ఉంటుంది. ఒళ్లంతా నొప్పులు ఉంటాయి. బోన్ క్యాన్సర్ రావటానికి ప్రత్యేకంగా ఏమీ కారణాలు తెలియదు.

ఎముక క్యాన్సర్ రకాలు....

కొన్ని రకాల ఎముక క్యాన్సర్ సాధారణంగా పిల్లలలో సంభవిస్తుంది, మరికొన్ని కేసుల్లో పెద్దల్లో వస్తుంది. ఆస్టియోసార్కోమా అనేది ఎముక క్యాన్సర్ యొక్క అత్యంత సాధారణ రూపం. అటువంటి కణితిలో క్యాన్సర్ కణాలు ఎముకలను ఉత్పత్తి చేస్తాయి. ఈ రకమైన ఎముక క్యాన్సర్ చాలా తరచుగా యువకులు, పిల్లలలో, చేయి లేదా కాలు ఎముకలలో సంభవిస్తుంది. కొండ్రోసార్కోమా చేతులు, కాళ్లు లేదా పొత్తికడుపులో, మధ్య వయస్కులు, పెద్దవారిలో సంభవిస్తుంది. శరీరంలోని ఇతర భాగాల నుంచి ఎముకలకు వ్యాపించే క్యాన్సర్‌ను సెకండరీ బోన్ క్యాన్సర్ లేదా మెటాస్టాటిక్ క్యాన్సర్ అంటారు. క్యాన్సర్ రొమ్ము, ప్రోస్టేట్, ఊపిరితిత్తుల నుంచి ఎముకలకు వ్యాపిస్తుంది. క్యాన్సర్ కోసం రేడియోథెరపీ సమయంలో రేడియేషన్‌కు గురికావడం వల్ల భవిష్యత్‌లో ఎముక క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుంది.

వ్యాధి నిర్ధారణ....

ఎక్స్ రే ద్వారా శరీరంలో ఏ ఎముకలో ప్రాబ్లెమ్ ఉన్నా తెలుసుకోవొచ్చు. ఎముక విరిగినా, ఫ్రాక్చర్ అయినా సులభంగా ఎక్స్ రే ద్వారా తెలుసుకోవొచ్చు. ఎక్స్ రేలో క్యాన్సర్ గడ్డల పరిణామాన్ని స్పష్టంగా చూసే అవకాశం ఉంది. బోన్ స్కాన్, సీటీ స్కాన్ , ఎమ్మారై స్కాన్ లాంటి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి క్యాన్సర్‌ను నిర్ధారిస్తారు.

అందుబాటులో ఆధునిక చికిత్స



ప్రస్తుతం ఆధునిక చికిత్స అందుబాటులో ఉంది. క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే చాలా త్వరగా నయం చేయవచ్చు. ప్రాథమిక దశలోనే గుర్తించే పరీక్షలూ ఉన్నాయి. కీమోథెరపీ, రేడియేషన్, సర్జికల్ ప్రొసీజర్స్ బోన్ క్యాన్సర్ చికిత్సకు వినియోగిస్తున్నారు. బోన్ క్యాన్సర్ చాలా అరుదుగా వస్తుంది. ప్రతినెలా నలుగురు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

–డాక్టర్ ఎం.జి.నాగకిషోర్,
సీనియర్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గుంటూరు

ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో అన్ని రకాల క్యాన్సర్‌లకు ఒక్క నయాపైసా ఖర్చు లేకుండా ఉచితంగా కార్పొరేట్ వైద్యసేవలు అందిస్తున్నారు. ప్రతిరోజూ క్యాన్సర్ ఓపీ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఆపరేషన్లు ఉచితంగా చేసి మందులు కూడా అందిస్తున్నారు. క్యాన్సర్ సోకగానే భయపడకుండా ధైర్యంగా ఉండి చికిత్స చేయించుకుంటే పూర్తిగా వ్యాధి నుంచి కోలుకోవచ్చు.

–డాక్టర్ యశస్వి రమణ,
గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్

అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో సాగడం లేదు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో టెండర్ ఆమోదం పొందిన అభివృద్ధి పనులు క్షేత్ర స్థాయిలో ఆశించిన స్థాయిలో జరగడం లేదని, పనుల్లో జాప్యం చేస్తున్న కాంట్రాక్టర్లు, పర్యవేక్షణ అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. కమిషనర్ చాంబర్‌లో ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు సంబంధించి తమ నుంచి ఆమోదం పొందిన టెండర్లకు వర్క్ ఆర్డర్‌లు ఇచ్చి, క్షేత్ర స్థాయిలో పనులు చేయించడంలో ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రాధాన్య కలిగిన పనుల్లో కూడా తీవ్ర నిర్లక్ష్యంపై అసహనం వ్యక్తం చేసి, ఇక నుంచి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు మేరకు నాణ్యతా ప్రమణాలు పాటిస్తూ చేయాలని చెప్పారు. ఎమినిటి కార్యదర్శులకు జాబ్ చార్ట్, క్షేత్ర స్థాయి పనుల పరిశీలనపై శిక్షణ ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతిపై ప్రతి వారం సమీక్ష చేస్తామని వివరించారు. పూడికతీత పనులపై సమీక్షించి, నగరంలోని మేజర్, మీడియం డ్రెయిన్లలో నూరు శాతం పూడిక పనులు జరగాలని ఆదేశించామని తెలిపారు. పనులను తమ రోజువారీ క్షేత్ర స్థాయి విజిట్‌లో పరిశీలిస్తామన్నారు. డ్రెయిన్లపై తప్పనిసరిగా ఆక్రమణలు తొలగించిన తర్వాతనే పూడిక తీయాలని సూచించారు. కోర్టు కేసుల్లో కౌంటర్లు సకాలంలో దాఖలు చేయడం, ప్యారావైజ్ రిమార్క్స్ ఇవ్వడం చేయాలన్నారు. అధిక ప్రాధాన్యం కలిగిన పనులను వేగంగా చేపట్టడానికి ఈఈలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, ఈఈ కోటేశ్వరరావు, ఏడీహెచ్ శాంతి, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమైన కమిషనర్

తాగునీటి సరఫరాలో అప్రమత్తంగా ఉండాలి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సరఫరాలో ఇంజినీరింగ్ అధికారులు, కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం కమిషనర్ స్తంభాల గరువు, గుజ్జనగుండ్ల రిజర్వాయర్లను డ్రోన్ ద్వారా పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రతి రిజర్వాయర్‌ని నిర్దేశిత గడువు మేరకు శుభ్రం చేయాలన్నారు. ఎమినిటీ కార్యదర్శులు తప్పనిసరిగా తాగునీటి సమయంలో క్లోరిన్ శాంపిల్స్ సేకరించాలని, ఎక్కడైనా కలుషిత నీటి సరఫరాని గుర్తిస్తే తక్షణం ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారం చేయాలన్నారు.



కృష్ణనగర్ ఆరో వీధి చిన్నారుల పార్కు వద్ద ఎగుడు, దిగుడుగా..



రహదారిపై గుంతలతో..

రహదారిపై నిర్లక్ష్యమేలా..

ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడటంతో రాకపోకలకు ఇబ్బందులకు గురవుతున్నారు. కృష్ణనగర్ ఆరో వీధిలో ఇటీవల ప్రధాన రహదారి రెండు వైపులా సిమెంట్ కాలువలు నిర్మించారు. పనులు పూర్తి అయినా తర్వాత ఆ రహదారిలో రాకపోకలకు పాదచారులు, చోదకులు అవస్థలు పడుతున్నారు. చిన్నారుల పార్క్ వద్ద గతంలో పైపులైను నిమిత్తం తవ్వారు. పనులు అనంతరం సరిగా చదను చేయలేదు. కల్వర్టుల రెండు వైపులా సిమెంట్‌తో లేదా తారుతోనైనా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా, వాటిని పూర్తిగా విస్మరించారు. దీంతో ఒట్టి కంకరరాళ్లు అక్కడ వేయడంతో ఇబ్బందిగా మారింది. దీనికితోడు కంకర రాళ్లు రహదారిపైకి చేరడంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే చోదకులు జారిపడిపోతున్నారు. కృష్ణనగర్ ఎయిడెడ్ ప్రైమరీ పాఠశాల ఎదురు రహదారి అధ్వానంగా మారింది. గుంతలమయంగా ఉండటంతో పాఠశాలకు వచ్చేటప్పుడు, పోయేటప్పుడు పిల్లలు పడిపోతున్నారు. ఇక ఎన్టీఆర్ విగ్రహం సమీపాన మురుగునీరు రహదారిపైనే స్తంభించింది. మురుగునీరు కాలువలోకి పోయేందుకు అవకాశం లేకపోవడంతో నెలల తరబడిగా నిలిచిపోతుంది.

– నగరంపాలెం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటెపాడు: కాకుమానువారితోట ఉప కేంద్రం, ఆటోనగర్ ఉపకేంద్రాల మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు డీ–9 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీహెచ్ ఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. కాకుమానువారితోట, వల్లూరివారితోట, మాలకొండయ్య కాలనీ, వసంతరాయపురం, సంజీవయ్య నగర్, ఆటోనగర్, గడ్డిపాడు, నెహ్రూనగర్, వెంకటాద్రిపేట, మోతీలాల్ నగర్ తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

- 11 కేవీ యాదవుల బజార్ ఫీడర్ నందు మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. సత్యనారాయణ స్వామి గుడి, బూరెలు వారి వీధి, కృష్ణుడి కళ్యాణ మండపం, బాలాజీ నగర్ వినియోగదారులు సహకరించాలని కోరారు.
- ఫీడర్ల మరమ్మతుల దృష్ట్యా డీ–3 సెక్షన్‌లోని 11 కేవీ రైలు పేట ఫీడర్, 11 కేవీ టాలీవుడ్ ఫీడర్, 11 కేవీ గుంటూరువారితోట ఫీడర్, 11 కేవీ నెహ్రూనగర్ ఫీడర్, 11 కేవీ 11వ ఫీడర్, కొత్తపేట, శివాలయం రోడ్, రామిరెడ్డితోట, ప్రకాష్‌నగర్, గుంటూరువారితోట, గణేశ్వరరావు పేట, పొత్తూరివారితోట, లాలాపేట, డీ–10 సెక్షన్‌లో 11 కేవీ బుడంపాడు ఫీడర్ పొన్నూరు రోడ్, సాయిబాబా కాలనీ, బైపాస్ రోడ్, చంద్రబాబునాయుడు కాలనీ, హుస్సేన్ నగర్, రవూఫ్ కాలనీ, డీ–1 సెక్షన్ నందు 11 కేవీ 19వ ఫీడర్, బ్రాడీపేట 1 నుంచి 5వ లైన్ వరకు శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందని టౌన్–1 డీఈఈ షేక్ ముస్తాక్ అహమ్మద్ శుక్రవారం తెలిపారు.
- 33 కేవీ లైన్‌లో చెట్ల కొమ్మలు తొలగించుట, ఎస్ఎస్ మెయిట్‌నెన్స్ కారణంగా చంద్రమౌళినగర్, కృష్ణనగర్, అశోక్‌నగర్, దేవాపురం, లక్ష్మీపురం మెయిన్ రోడ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డీఈఈ ఎస్.గురవయ్య తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.
- విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఓఎస్‌డీ టీ2 డెప్యూటీ ఈఈ ఎస్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ఎస్‌వీఎస్‌కాలనీ, జేకేసీ కళాశాల రోడ్డు, తారకరామనగర్, స్తంభాలగరువు, సాయినగర్, శ్యామలనగర్, రవీంద్రనగర్, గుజ్జనగుండ్ల, విద్యనగర్, వికాస్‌నగర్, సిద్ధార్థనగర్, సాయిబాబారోడ్, విజయపురికాలనీ, అన్నపూర్ణ నగర్, ఇన్నర్‌రింగ్‌రోడ్, రెడ్డిపాలెం, శారదా కాలనీ, మల్లికార్జునపేట, చంద్రమౌళినగర్, లక్ష్మీపురం ప్రధాన రహదారి, బృందావన్‌గార్డెన్స్, అశోక్‌నగర్, దేవాపురం ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం!

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలో నెహ్రూనగర్ ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. పలు ప్రాంతాల్లో ఇప్పటికే రేషన్ బియ్యం తరలిస్తున్న కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి బియ్యాన్ని తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు వంద బస్తాల రేషన్ బియ్యాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే దీనిపై ఎటువంటి కేసు నమోదు కాలేదు.

చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభ



చేబ్రోలు: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బోయపాలెం డైట్ కాలేజీలో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో శుక్రవారం జరిగిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో చేబ్రోలు మండలం నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.ఏడుకొండలు తెలిపారు. 9వ తరగతి విద్యార్థిని కె.బిందు తేజ 'మాదకద్రవ్యాలు పొగాకు నిషేధం' అనే అంశంపై జరిగిన చిత్రలేఖనంలో ప్రథమ స్థానం సాధించి రూ.1500 నగదు అవార్డు గెలుపొందింది. వ్యాసరచనలో 'లింగ సమానత్వం గౌరవం' అంశంపై ఎం.దీక్షిత జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.1000 నగదు గెలుపొందారు. బాలికకు నగదుతో పాటు సర్టిఫికెట్‌ను డైట్ కళాశాల ప్రిన్సిపాల్, నరసరావుపేట ఉప విద్యాశాఖాధికారి సుభాని అందించారు.

ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచండి

జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణ



మాట్లాడుతున్న సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు త్వరితగతిన కోలుకునేందుకు వారి కుటుంబ సభ్యులు, బంధువులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ అన్నారు. మీకోసం – మేము అనే కార్యక్రమం 21వ వారం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ రోగులు, వారి సహాయకులతో మాట్లాడారు. ఆస్పత్రి ఆవరణలో వాహనాలపై తిరగకూడదని, కాలుష్యం పెరిగి చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్యానికి ఇబ్బంది ఏర్పడుతుందని చెప్పారు. రోగి మంచాలపై సహాయకులు కూర్చొకూడదని, ఒకరు మాత్రమే రోగికి సహాయకులుగా వార్డులో ఉండాలన్నారు. వైద్య పరీక్షలన్ని ఉచితంగా చేస్తారని, ఎవరికి డబ్బులు చెల్లించాల్సిన పనిలేదని, ఎవరైనా డబ్బులు అడిగితే రశీదు తీసుకోవాలన్నారు. చికిత్స పొందుతున్న రోగులకు రక్తం ఎక్కించేందుకు వారి కుటుంబ సభ్యులు రక్తదానం చేయాల్సి ఉంటుందన్నారు. ఎవరైనా రక్తం ఇస్తామని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తే ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు జాగృతి సంస్థ సహకారంతో సూపరింటెండెంట్ బియ్యం పంపిణీ చేశారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బి.వి.రావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో క్యాజువాల్టికి పాముకాటు, గడ్డిమందు తాగిన కేసులు ఎక్కువగా వస్తున్నాయని వివరించారు. అత్యవసర చికిత్సల కోసం వచ్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయంపై రోగుల సహాయకులకు వివరించారు. నూతనంగా గేట్‌పాస్ విధానం తీసుకొచ్చామని, ఆస్పత్రి లోపలకు వచ్చేవారు, సెక్యూరిటీ సిబ్బందికి గేట్ పాస్ చూపించాలని విజ్ఞప్తి చేశారు.

జనాభా నియంత్రణతో ప్రకృతి వనరుల సంరక్షణ



మాట్లాడుతున్న స్టెప్-స్వశక్తి మేనేజర్ రాధిక

గుంటూరు ఎడ్యుకేషన్: జనాభా పెరుగుదలతో ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయని గుంటూరు జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్-స్వశక్తి) మేనేజర్ బి.రాధిక పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని బీహెచ్ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి మాట్లాడుతూ జనాభా నియంత్రణ లేకుండా పెరిగిపోతుండటం వలన గ్రామీణ, అటవీ ప్రాంతాలు, పంట భూములు తరిగిపోయి పట్టణ ప్రాంతాలుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తద్వారా పెరుగుతున్న జనాభాకు సరిపడా వనరులు అందుబాటులో లేని పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అధ్యాపకులు పద్మజ, సరోజ మాట్లాడుతూ 1997 నుంచి ప్రపంచ వ్యాప్తంగా జనాభాను లెక్కించే పద్ధతిని ప్రారంభించారని, జనాభా పెరుగుదల ప్రకృతి వనరులపై ప్రభావాన్ని చూపే అంశాలను వివరించారు.

కమ్యూనిటీ టాయిలెట్స్ ప్రారంభం



ప్రారంభిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎమ్మెల్యే గల్లా మాధవి

నెహ్రూనగర్: నగరంలో ఐటీసీ బంగారు భవిష్యత్ నగరపాలక సంస్థతో కలిసి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం, స్కూల్స్‌లో డైనింగ్ హాల్స్ నిర్మాణం చేయడం అభినందనీయమని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం ఐటీసీ బంగారు భవిష్యత్ సంస్థ నిర్మాణం చేసిన స్థానిక ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్లో విద్యార్థినుల కోసం డైనింగ్ హాల్, తుఫాన్ నగర్‌లో కమ్యూనిటీ టాయిలెట్స్‌ను ప్రారంభించారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఐటీసీ గుంటూరు నగరంలో పలు సేవా కార్యక్రమాలు, ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కల్పించడానికి నగరపాలక సంస్థతో కలిసి కృషి చేస్తుందన్నారు. ప్రధానంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై ప్రజలకు అవగాహన కలిగించడంలో ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. తుఫాన్ నగర్‌లో కమ్యూనిటీ టాయిలెట్స్ నిర్మాణం ద్వారా సుమారు 35 పేద కుంటుంబాలు నివసించే ప్రాంతంలో బహిరంగ మలమూత్ర విసర్జన లేకుండా చేశారని చెప్పారు. ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్‌లో ప్రత్యేకంగా విద్యార్థినుల కోసం సుమారు రెండు వందల మంది సామర్థ్యంతో డైనింగ్ హాల్ నిర్మాణం చేయడం అభినందనీయమని చెప్పారు. సదరు స్కూల్‌లో తడి వ్యర్థాలను 45 రోజుల పాటు శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి, ఎరువు తయారు చేసి, మొక్కలకు వినియోగిస్తున్నారని వివరించారు. ఐటీసీ ఏబీడీ వైస్ ప్రెసిడెంట్ వీరా స్వామీ మాట్లాడుతూ తుఫాన్ నగర్‌లో రూ.12 లక్షలతో కమ్యూనిటీ టాయిలెట్స్, ఎన్జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్‌లో రూ.8 లక్షలతో డైనింగ్ హాల్ నిర్మాణం చేసి చేయడం జరిగిందన్నారు.

విద్యార్థులకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు



డాక్టర్ వంశీకృష్ణను సత్కరిస్తున్న జూపూడి రంగరాజు, నాగభూషణం

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ సహకారంతో విద్యార్థులకు, కళాశాల సిబ్బందికి ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం తెలిపారు. శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో నాగభూషణం మాట్లాడుతూ మూడు రోజుల పాటు డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్ మేనేజర్ వంశీకృష్ణ పర్యవేక్షణలోని టెక్నీషియన్లు పాల్గొని 350 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న వారికి కంటి అద్దాలను సూచించారు. అదే విధంగా శుక్లాలు, గ్లకోమా వంటి పెద్ద సమస్యలకు నిపుణుల సలహాలను సూచించారని వివరించారు. వైద్య శిబిరంలో పాల్గొన్న హాస్పిటల్ యాజమాన్య ప్రతినిధులతో పాటు వైద్యుల బృందాన్ని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు సత్కరించారు. కార్యక్రమంలో ఫార్మా.డి డైరెక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. ప్రత్యూష, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఏ. రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలి



మాట్లాడుతున్న కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలను సాధించే లక్ష్యంతో ఉన్న విద్యార్థులు ఆయా పోటీ పరీక్షలకు ప్రణాళికతో సన్నద్ధం కావాలని ప్రముఖ పోటీ పరీక్షల శిక్షణ నిపుణుడు డాక్టర్ ఈ.కోటేశ్వరరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాల ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్, ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో విద్యార్థులకు ప్రపంచ వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న పరిణామాలపై చక్కటి అవగాహన కలిగి ఉండాలని, ప్రతి రోజూ దినపత్రికలను చదివి, తాజా పరిణామాలను తెలుసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ వార్తలపై అవగాహన అవసరమని తెలిపారు. ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ వై. సురేష్‌బాబు మాట్లాడుతూ డిగ్రీ చదువుతో పాటు విద్యార్థులు ప్రతి రోజు కరెంట్ అఫైర్స్ ద్వారా జ్ఞానాన్ని పొందాలని, ఇందు కోసం దినపత్రికల చదవాలని సూచించారు. సదస్సులో పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె. సాంబశివరావు, ఆంగ్ల శాఖ అధ్యాపకురాలు పి.నాగసుశీల పాల్గొన్నారు.